### 550 కార్లతో, 20 బస్సులలో భారీ ర్యాలీతో

## వరంగల్‌కు బీఆర్ఎస్ నేతలు



దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్యే

ఎల్బీనగర్, ఏప్రిల్ 26: ఎల్బీనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల కోసం భారీ కాన్వాయ్‌తో తరలివెళ్లనున్నారు. నియోజకవర్గంలోని పదకొండు డివిజన్ల నుండి భారీగా కార్లతో వరంగల్ సభకు తరలివెళ్లేందుకు అన్ని సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. నియోజకవర్గం శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నాయకత్వంలో మొత్తం 550 కార్లతో పాటుగా నియోజకవర్గం వ్యాప్తంగా 15 బస్సులలో వరంగల్ సభకు తరలివెళ్లనున్నారు. గడ్డిఅన్నారం, చైతన్యపురి, కొత్తపేట, నాగోలు, మన్సూరాబాద్, లింగోజిగూడ, చంపాపేట, హస్తినాపురం, బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్, వనస్థలిపురం డివిజన్ల నుండి కార్లలో ర్యాలీగా ఉదయం పది గంటలకు బయలుదేరి ఔటర్ రింగ్‌రోడ్డులో విజయవాడ జాతీయ రహదారిపై పెద్ద అంబర్ పేట్‌లోని వీఆర్‌సీ కన్వెన్షన్ హాల్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పార్టీ నాయకులు, శ్రేణులంతా కలిసి ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా మధ్యాహ్నం 12 గంటలకు ఘట్‌కేసర్ వద్ద హౌషాపూర్‌లోని ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటారు. ఆ ఫంక్షన్ హాల్‌లో సభకు వెళ్లే వారి అందరికీ భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. భోజనం చేసిన అనంతరం అక్కడి నుండి సాయంత్రం వరకు వరంగల్ సభ ప్రాంగణానికి చేరుతారు. బీఆర్ఎస్ వరంగల్ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పాటుగా పార్టీ శ్రేణులంతా అధిక సంఖ్యలో సభకు తరలివెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు.

#### వరంగల్‌కు భారీగా తరలివెళ్తాం: ఎమ్మెల్యే

తెలంగాణలో వరంగల్ సభ బీఆర్ఎస్ పార్టీ గుండె చప్పుడుగా నిలుస్తుంది. తెలంగాణ ప్రజల ఇంటిపార్టీగా, బీఆర్ఎస్‌ను రాష్ట్రవ్యాప్తంగా అక్కున చేర్చుకుంటున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం నుండి 550 కార్లు, 20 బస్సులలో భారీ ర్యాలీతో వరంగల్ సభకు తరలివెళ్లనున్నాము. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, బీఆర్ఎస్ తమకు శ్రీరామ రక్షగా భావిస్తున్నారు.

## రోడ్డు ఆక్రమణల తొలగింపు

మన్సూరాబాద్, ఏప్రిల్ 26: రోడ్లను ఆక్రమించి ఇరువైపులా వెలిసిన అక్రమ నిర్మాణాలను శనివారం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ హయత్ నగర్ సర్కిల్ అధికారులు తొలగించారు. హయత్ నగర్ బస్టాప్ నుంచి గుంటూరు మార్గంలో ఇరువైపులా తోపుడు బండ్లు, షెడ్లు, ఇతర నిర్మాణాల వలన నిత్యం ట్రాఫిక్ రద్దీ ఏర్పడి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల నుంచి వాహనదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు భారీ పోలీసు బందోబస్తు మధ్య ఎక్సవేటర్‌తో అక్రమ నిర్మాణాలను తొలగించారు. పలు ప్రాంతాల్లో షాపు యజమానులు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో వాగ్విదానికి దిగారు. టౌన్ ప్లానింగ్ ఏసీబీ శాంసన్ మాట్లాడుతూ, ఇష్టానుసారంగా రోడ్లను ఆక్రమించడం వలన ప్రతి నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నాయని తెలిపారు. హయత్ నగర్ చౌరస్తా నుంచి గుంటూరు చౌరస్తా వరకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు తెలిపారు.



బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక.. గులాబీ జెండా

ఆర్కే పురం, ఏప్రిల్ 26 . వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నేడు జరిగే బీఆర్ఎస్ రజితోత్సవ బహిరంగ సభకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు వేల సంఖ్యలో తరలిరావాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సరూర్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని నియోజకవర్గ శాసనసభ్యురాలు, మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి సరూర్‌నగర్ డివిజన్‌లోని అంబేద్కర్ నగర్

కాలనీలో పార్టీ జెండాను ఆవిష్కరించి భారీ బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆ తరువాత హుడా కాలనీ , బీఎం హోం , పంజాల కాలనీ , రోడ్ నెం 5, భగత్ సింగ్ నగర్ కమిటీ హాల్ ,భగత్ సింగ్ నగర్ మహిళా బిల్డింగ్ వద్ద , హుడా కాంప్లెక్స్‌లలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణకు మళ్లీ మంచి రోజులు రావాలంటే కేసీఆర్ రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రసంగం వినేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభతో కాంగ్రెస్ గుండెల్లో రైలు పరిగెడుతున్నాయన్నారు. స్వ రాష్ట్రం కోసం పుట్టిన జెండా, పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన గౌరవ జెండా.. మన గులాబీ జెండా అన్నారు. ఓరుగల్లు మహాసభను ఘనంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహభరితంగా జెండా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో అంకి రెడ్డి , రాష్ట్ర సీనియర్ నాయకులు సాజిద్, రాగం ఎల్లయ్య యాదవ్, మైనార్టీ నాయకులు ఇస్మాయిల్, గౌని శ్రీనివాస్ గౌడ్ , సోషల్ మీడియా కన్వీనర్ వుత్తుపల్లి శ్రీనివాస్, సుశీల రెడ్డి , రాజేష్ గౌడ్ , కొండా గిరి గౌడ్, రిషి , గోవర్ధన్ రెడ్డి ,జహీర్ ,ప్రత్యుష్, రాగం సునీల్ యాదవ్, కడారి రాజు యాదవ్, ఆకుల అరుణ్ కుమార్, కిరణ్, సాయి కిరణ్ , రాగం సురేష్ యాదవ్, ఫయాజ్ , కట్ట ప్రవీణ్, తేజ , సాలమ్మ , రజాక్, సాజిద్, రాజశేఖర్ , గుఫ్రాన్ ,భాగ్య లక్ష్మి , మదర్ ,బాలరాజ్ సుధ, శృతి , జహంగీర్ ,నరేశ్ గౌడ్, యాదగిరి, దేవరాజ్ , శివ ముదిరాజ్, ఏలాద్రి, కిషోర్, మురళి పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఫ్లెక్సీలు తొలగింపుపై ఆగ్రహం

### కాంగ్రెస్ ప్రభుత్వంలో వణుకు మొదలు



బీఆర్ఎస్ ఫ్లెక్సీలను తొలగించడంతో అధికారుల తీరుపై ఆగ్రహంతో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్బీనగర్, ఏప్రిల్ 26ః ఎల్బీనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికారులు తొలగించడంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా వరంగల్‌లో నేడు భారీ బహిరంగ సభ నిర్వహించున్నారు. అయితే ఈ సభ కోసం ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సభ నేడు ఉండగా శనివారమే ఫ్లెక్సీలను తొలగించడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ, బీజేపీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు రోజుల తరబడి తొలగించకుండా, కనీసం వాటివైపు చూడకుండా మిన్నకుండిపోయిన జీహెచ్ఎంసీ అధికారులు బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీల విషయంలో మాత్రం ఒక్క రోజు కూడా ఆగలేకపోయారని నాయకులు ఆరోపించారు. ఆదివారం సమావేశం ఉండగా ఒక రోజు ముందుగానే ఫ్లెక్సీలను తొలగించడంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. డివిజన్ల వారీగా బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను కట్ చేసి తీసుకుని పోవడంపై వారు మండిపడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ పార్టీకి వణుకు పుడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభ విజయం సాధించి తెలంగాణ ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ నిలిచిపోతుందని వారు అన్నారు.



శ్రీరామ్‌నగర్ చౌరస్తాలోజెండా పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, తదితరులు

## పేదల సంక్షేమానికి కాంగ్రెస్ చేసిందేమి లేదు: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, ఏప్రిల్ 26: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పదహారు నెలలు గడుస్తున్నప్పటికీ పేద ప్రజల సంక్షేమానికి చేసింది శూన్యమేనని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని నేడు వరంగల్, ఎల్కతుర్తి లో నిర్వహించే బహిరంగ సభ వేడుకల్లో భాగంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధి శ్రీరామ్ నగర్ చౌరస్తా, బొమ్మల గుడి వద్ద డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జెండా పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబాన్ని ఏ విధంగా ఇబ్బందులు పెట్టాలా అనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందే తప్ప పేదల గురించి ఏ కోశనా ఆలోచించే సమయం వారికి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని, వారికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా హాజరై ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకతను తెలిపేందుకు ఎల్కతుర్తికి కదులుతున్నారని తెలిపారు.

#### ఫ్లెక్సీలు, తోరణాలను తొలగించడం హేయమైన చర్య

కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలకు పాల్పడుతోందని రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఎల్బీనగర్ నియోజకవర్గం లో పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ ఫ్లెక్సీలు, తోరణాలను రాత్రికి రాత్రి తొలగించడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అన్నారు. శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకు ఫ్లెక్సీలు, తోరణాలను కడితే రాత్రి ఒంటిగంట అనంతరం వాటిని తొలగించేశారని తెలిపారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. చిల్లర రాజకీయాలను మానుకోకపోతే కాంగ్రెస్ పార్టీ అధోగతి పాలవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, నాయకులు రుద్ర యాదగిరి, పోచబోయిన జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్ రెడ్డి, కొసనం ధనలక్ష్మి, కొసనం వెంకటరెడ్డి, నర్రి వెంకన్న, పరంద నర్సింగ్ రావు, నరి అంజయ్య, చంగల్ చంద్రమోహన్, ఆనంద్, వల్లభ అరుణ్ యాదవ్, రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

#### తెలంగాణ దశ దిశను మార్చింది గులాబీ జెండా

వనస్థలిపురం, ఏప్రిల్ : దశాబ్ధాల కలను నేరవేరుస్తూ తెలంగాణను సాధించి, వచ్చిన తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చిన ఘనత గులాబీ జెండాది, ఉద్యమ నేత కేసీఆర్‌దేనని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం వనస్థలిపురం డివిజన్, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో జెండా పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట వనస్థలిపురం డివిజన్ ఏ క్వార్టర్స్‌లో డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ ఆధ్వర్యంలో జెండా పండుగను నిర్వహించారు. అనంతరం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రినగర్, సాహెబ్‌నగర్, ఎస్కేడినగర్‌లలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో జెండా పండుగను నిర్వహించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లిందన్నారు. కేసీఆర్ ఆలోచన, పారదర్శకత తెలంగాణకు శ్రీరామ రక్ష అన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, దళిత గిరిజనుల సంక్షేమానికి గత ప్రభుత్వం చేసిన కృషి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ పాలన తెలంగాణకు గడ్డు కాలాన్ని తీసుకువస్తోందన్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుతున్నారన్నారు. వరంగల్ నేడు జరిగే సభకు ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు చాపల శ్రీనివాస్ యాదవ్, లగ్గోని శ్రీధర్‌గౌడ్, మిట్టా రామ్మోహన్, సతీష్ చౌదరి, మనోజ్ గౌరిశెట్టి దయాకర్, రాఘవేందర్‌రావు, నిర్మలాదేవి, గంగం రాజు, అనిల్ చౌదరి, గడ్డం మల్లేష్‌గౌడ్, గంగం శివశంకర్, సతీష్‌కుమార్ గౌడ్, సుమన్‌గౌడ్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



వనస్థలిపురంలో చింతల రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ జెండా పండుగలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, తదితరులు

## ఇంటర్ ఫలితాల్లో 'ఆల్ఫోర్స్' ప్రభంజనం



విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి

చంపాపేట, ఏప్రిల్ 16:ఇంటర్మీడియట్ విద్యా చరిత్రలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు నూతన అధ్యాయాన్ని సృష్టించడం తనకు ఎంతో గర్వంగా ఉందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించడాన్ని అభినందిస్తూ చంపాపేట డివిజన్ పరిధి కర్మ న్ ఘాట్ లోని ఆల్ఫోర్స్ కాలేజీలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సన్మాన కార్యక్రమానికి నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థలు ప్రారంభం నాటి నుండి అత్యుత్తమ ఫలితాలతో జయకేతనం ఎగురవేస్తున్నాయని, ఆ సాంప్రదాయాన్ని ఈ సంవత్సరం సైతం ఇంటర్మీడియట్ ఫలితాల్లో మరోసారి ఉత్తమ ప్రతిభను చాటి ఆల్ఫోర్స్ విద్యా సంస్థలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు సంతోషాన్ని కలిగించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేస్తున్నానని నరేందర్ రెడ్డి వెలిబుచ్చారు. రాష్ట్రస్థాయిలో 997 మార్కులతో బైపీసీ విభాగంలో అగ్రస్థానం, 996 మార్కులతో ఎంపీసీలో అగ్రస్థానం సాధించడం ఇంటర్మీడియట్ చరిత్రలోనే చాలా గొప్ప విషయమన్నారు.అదేవిధంగా స్థానిక కర్మన్ ఘాట్‌లోని విద్యార్థులు, హస్తినాపురం జూనియర్ కళాశాలలో విద్యార్థులు సైతం అత్యుత్తమ ఫలితాలను సాధించారని చెప్పారు. విద్యాసంస్థల విజయానికి ఎల్లప్పుడు సహకరిస్తున్న తల్లిదండ్రులకు, అత్యుత్తమ ఫలితాలకు అహర్నిశలు కృషి చేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి, మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజేతలందరికీ పుష్పగుచ్ఛాలతో పాటు స్కోర్ కార్డ్స్‌ను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు వేయడంతో తొలగిన కష్టాలు

నమస్తే ఎఫెక్ట్

సైదాబాద్, ఏప్రిల్ 26: మూడు నెలల క్రితం రోడ్డును తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారడంతో బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులను జీహెచ్ఎంసీ మలక్ పేట సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు తొలగించారు. రోడ్లు తవ్వి మూడు నెలలుగా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'తవ్వారు వదిలేశారు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ మలక్ పేట సర్కిల్ అధికారులు స్పందించారు. తవ్వి వదిలేసిన రోడ్డుకు సుమారు 12 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు వేశారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్ ఘడ్, గాంధీనగర్ వెళ్లే మార్గం కొత్త రూపం దాల్చడంతో రోడ్డు ప్రమాదాలు తప్పాయని వాహనదారులు, పాదచారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆస్మాన్ ఘడ్ వెళ్లే మార్గంలో కొత్తగా వేసిన సీసీ రోడ్డు..

## బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి: ఎమ్మెల్యే

చంపాపేట, ఏప్రిల్ 26: వరంగల్లో నేడు జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గం పరిధిలోని లింగోజిగూడ డివిజన్ లో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జెండాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై పార్టీ శ్రేణులతో కలిసి జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... నేడు వరంగల్ లో జరిగే పార్టీ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై సభ విజయవంతం అయ్యేట్లు ఆయా డివిజన్లో బాధ్యులు కృషి చేయాలని సూచించారు. పార్టీ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేసే ప్రతి కార్యకర్తకు, నాయకులకు బీఆర్ఎస్ పార్టీలో తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ సభను మన ఇంటి పండుగగా భావించి పార్టీ శ్రేణులు అందరూ సభకు తరలి రావడంతో పాటు పార్టీ సానుభూతిపరులను సభకు తరలించుకు రావాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిలక్ రావు, రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు, పార్టీ పలు విభాగాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

#### కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు : సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట్, ఏప్రిల్ 26: తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి అన్నారు. వరంగల్ లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవాలకు ప్రజలు స్వచ్ఛందంగా లక్షలాదిగా తరలి వస్తున్నారని ఆమె పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి 40 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 200 సొంత కార్లల్లో ర్యాలీగా వస్తున్నారని ఆమె పేర్కొన్నారు. 42 ప్రైవేట్ బస్సులను కూడా బుక్ చేసుకోవడం జరిగిందన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నుంచి లక్షలాదిగా ప్రజలు తరలివస్తున్నారని తెలిపారు. కేసీఆర్ అంటేనే ప్రజలకు ఒక్క బలమైన నమ్మకం ఉందన్నారు. రాష్ట్రమంతా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలు, రైతులు కన్నీళ్లు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిన నాయకుడు కేసీఆర్ నాయకత్వమే ఈ రాష్ట్రానికి శ్రీరామరక్ష అన్నారు.



లింగోజిగూడ లిబర్టీ హోటల్ సమీపంలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

#### పార్టీ జెండాలను ఎగురవేసిన నేతలు

బడంగ్ పేట్, ఏప్రిల్ 26: వరంగల్‌లో నేడు నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు మహేశ్వరం నియోజకవర్గం అంతా ముస్తాబు అయింది. గులాబీ జెండాల తోరణాలు, 'చలో వరంగల్' వాల్ పోస్టర్లను ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రా రెడ్డి ఆదేశానుసారం ఆదివారం ఉదయం 08:30 గంటల నుండి గులాబీ జెండాలను ఆవిష్కరించి 'చలో వరంగల్'కు బయలుదేరుతారు. మీర్ పేట్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లెలగూడ స్వాగత్ గ్రాండ్ చౌరస్తా లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. మీర్ పేట్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ, మీర్ పేట్ పరిధిలో గల వివిధ డివిజన్లలో జెండా ఎగురవేయడంతో రజతోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు దుర్గా దీప్ లాల్ చౌహాన్, తీగల విక్రమ్ రెడ్డి, ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్, లావణ్య బీరప్ప, మేకల రవీందర్ రెడ్డి, బొక్క రాజేందర్ రెడ్డి, రేఖ లక్ష్మణ్, యం.ఏ రజాక్, బీఆర్ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్, శ్రీను నాయక్, బి.ఆర్.యస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్ధాల భారత్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సిరూర్ బాల్ రాజ్, సుదర్శన్ రెడ్డి, వంటేరు నరసింహా రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు హాము నాయక్, నర్సిరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, నాయకులు శిశుపాల్ రెడ్డి, అవినాష్, గోపి యాదవ్, రామకృష్ణ, అర్జున్, యాదగిరి, చారి, సహదేవ్, సుదర్శన్ ,శేఖర్ గౌడ్, మీర్ పేట్ మహిళా అధ్యక్షురాలు సునీత బాల్ రాజ్, విజయలక్ష్మి, గ్రంథాలయ మాజీ డైరెక్టర్ పి.మాధవి, లతా శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

#### తుక్కుగూడలో..

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశానుసారంగా తుక్కుగూడ మున్సిపాలిటీ యూత్ ప్రెసిడెంట్ సామెల్ రాజ్ ఆధ్వర్యంలో జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవి నాయక్, ప్రెసిడెంట్ ప్రవీణ్ లావణ్య శ్రీధర్ రెడ్డి, సుధాకర్, శ్రీధర్, మహేష్, భరత్, జయరాజ్, రాజు పాల్గొన్నారు.

#### వరంగల్ సభకు భారీగా తరలుతాం

ఎల్బీనగర్, ఏప్రిల్ 26: వరంగల్ సభకు భారీ గా తరలుతామని బీఆర్ఎస్ ఎస్సీ విభాగం నాయకులు అన్నారు. బీఆర్ఎస్ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లెపాక యాదగిరి, పార్శపు శ్రీధర్, ఎర్పుల గాలయ్య, బాలాజీ గైక్వాడ్, చాన్ పాషా, ఆకుల వెంకటేష్, తొలకోప్పుల చక్రవర్తి తదితరులు ఎల్బీనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధ్వర్యంలో వరంగల్ సభకు భారీ వాహనాలతో ర్యాలీగా బయలుదేరుతామన్నారు.

## కేసీఆర్ ఫొటో ఉన్న ఫ్లెక్సీలు చూస్తేనే కాంగ్రెస్‌కు వణుకు

ఆర్కే పురం, ఏప్రిల్ 26. కేసీఆర్ ఫొటో ఉన్న ఫ్లెక్సీలు చూస్తేనే కాంగ్రెస్ వణకు పుడుతోందని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలో వరంగల్ సభ ప్రచారం కోసం వేసిన ఫ్లెక్సీలను కాంగ్రెస్ ప్రభుత్వం రాత్రికి రాత్రే తొలగించినందుకు అష్టలక్ష్మి కమాన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అరవింద శర్మ మాట్లాడుతూ, కేసీఆర్ ఫొటో ఫ్లెక్సీలను చూస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి భయం పట్టుకుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల రజతోత్సవ సభ విజయవంతం అవుతుందని ఇంటలిజెన్స్ రిపోర్టు రావడంతో కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతూ, ఫ్లెక్సీలు తీసి వేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా రజతోత్సవ సభను విజయవంతం చేసి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, రామాచారి, గొడుగు శ్రీనివాస్, సాజిద్, కొండ్ర శ్రీనివాస్ , కంచర్ల శేఖర్ , పెంబర్తి శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, జై శ్రీమన్నారాయణ, శ్యామ్ గుప్తా, జాహెద్, జగన్, రమేష్ కూర్మ , వీరస్వామి పాల్గొన్నారు.

### పరుపునకు మంటలు అంటుకొని..

## బాలుడి మృతి

### మరొక బాలిక పరిస్థితి విషమం



మృతి చెందిన అబ్దుల్ రెహమాన్

హయత్ నగర్, ఏప్రిల్ 26 : ప్రమాదవశాత్తు పడుకున్న పరుపునకు మంటలు అంటుకొని ఓ బాలుడు మృతిచెందాడు. మరో బాలిక పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ కేంద్రంలోని భువనేశ్వరి కాలనీలో అబ్దుల్ ఖాదర్ జిలాని, పొజియా బేగం దంపతులకు ఇద్దరు కుమారులలో పెద్ద కుమారుడు అర్షాన్, చిన్న కుమారుడు అబ్దుల్ రెహమాన్ (04), పెద్ద కూతురు ఆఫియా,చిన్న కూతురు అతిఫా(04) ఉన్నారు. శనివారం తెల్లవారుజామున పెద్ద కుమారుడు అర్షాన్, పెద్ద కూతురు ఆఫియా హాల్లో పడుకున్నారు. చిన్న కుమారుడు అబ్దుల్ రెహమాన్ (4), చిన్న కూతురు అతిఫా బెడ్ రూంలో పడుకున్నారు. దోమల కోసం పెట్టిన మస్కిటో కాయిల్ ప్రమాదవశాత్తు పిల్లలు అబ్దుల్ రెహమాన్, ఆతిఫా పడుకున్న పరుపుపై పడి పరుపు కాలిపోగా దట్టమైన పొగకు ఊపిరాడక పోవడంతో అబ్దుల్ రెహమాన్(4) అక్కడిక్కడే చనిపోయాడు. కూతురు ఆతిఫా ఆరోగ్యం విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం నీలోఫర్ హాస్పిటల్ కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

#### చెరువులో గుర్తు తెలియని మృతదేహం

పహాడి షరీఫ్, ఏప్రిల్ 26 : జల్ పల్లి పెద్ద చెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ప్రకారం.. జల్ పల్లి పెద్ద చెరువులో ఓ వ్యక్తి మృతదేహం తెలియడుతోందని స్థానికులతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలంకు చేరుకొని పరిశీలించగా మృతదేహం కుళ్లి పోయినట్లు గుర్తించారు. మృతదేహని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సీసీ కెమెరాలతోనే రక్షణ: సీపీ సుధీర్‌బాబు

పహాడి షరీఫ్, ఏప్రిల్ 26: దేశంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ వ్యవస్థ ప్రత్యేక గుర్తింపు సాధించిందని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. నేర నియంత్రణకు నిఘా నేత్రం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వై ఏ ఆర్ కన్వెన్షన్ హాల్ లో శనివారం సీపీ సుధీర్ బాబు 855 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రాచకొండ కమిషనరేట్ గత ఆరు నెలలుగా నేరాల నియంత్రణలో ముందువరుసలో ఉందన్నారు. సీసీ కెమెరాలు పోలీసులకు, ప్రజలకు అనేక రకాలుగా ప్రయోజనాన్ని అందిస్తున్నాయని తెలిపారు. సీసీ కెమెరాలతో నేరాలను అనేక సందర్భాల్లో పరిష్కరించామని వెల్లడించారు. ఇటీవల మల్కాజిగిరిలో ఓ యువతి పట్ల ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడని సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన పోలీసులు బాధితురాలు ఫిర్యాదు చేయకపోయినా.. స్టేషన్ అధికారులు సీసీ కెమెరాలో నమోదైన ఫుటేజ్ ద్వారా నిందితుడిని గుర్తించి జైలుకు తరలించామని తెలిపారు. మరో ఘటనలో మహేశ్వరంలో ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడని భావించామని.. సీసీ ఫుటేజ్ ద్వారా హత్య కేసుగా తేలిందన్నారు. స్నేహితులే స్నేహితుడిని హత్య చేసి తప్పించుకోవడానికి యత్నించారని తెలిపారు. సీసీ కెమెరాలు ఉంటే ఆ ప్రాంతంలో నేరస్తులు నేరం చేయడానికి భయపడుతురన్నారని తెలిపారు. సీసీ కెమెరాలు వినియోగంలోకి వచ్చిన తర్వాత సీసీ ఫుటేజ్‌ను కోర్ట్ లలో సాక్ష్యాలుగా సమర్పించడం వల్ల నేరస్తులకు త్వరతగతిన శిక్షలు పడుతున్నాయన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మూడు నెలల అత్యంత తక్కువ సమయంలో 57 మంది నేరస్తులకు శిక్షలు పడ్డాయన్నారు. సీసీ కెమెరాలు ఇరువై నాలుగు గంటలు పనిచేస్తూ పోలీసులకు, ప్రజలకు రక్షణ కల్పిస్తున్నాయని తెలిపారు. లండన్ లో రైల్వే స్టేషన్ లో జరిగిన బాంబు దాడి నిందితులను లండన్ పోలీసులు సీసీ కెమెరాల ద్వారానే గుర్తించి అదుపులోకి తీసుకున్న విషయాన్ని ప్రపంచ వ్యాప్తంగా తెలుసుకున్నామని వెల్లడించారు. ప్రజలు, నాయకులు, అధికారులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాల నియంత్రణకు సహకరించాలన్నారు. ఏప్రిల్ మాసంలోనే రాచకొండ కమిషనరేట్ పరిధిలో 3,140 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామన్నారు. జల్ పల్లి మున్సిపాలిటి కమిషనర్ మున్సిపాలిటి పరిధిలో సీసీ కెమెరాలకు ఇరువై లక్షలు కేటాయిస్తానన్నారని తెలిపారు. అనంతరం సీసీ కెమెరాల దాతలకు కమిషనర్ మెమెంటోలు అందజేశారు, ఈ కార్యక్రమంలో మహేశ్వరం జోన్ డీసీపీ సునీతా రెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీలు లక్ష్మి కాంత్ రెడ్డి, కేవీపీ రాజు, బాలాపూర్ ఇన్స్పెక్టర్, సుధాకర్, పహాడిషరీఫ్ ఇన్స్పెక్టర్ గురువా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు, ఏప్రిల్ 26 .ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు . మండల పరిధిలోని మహమ్మద్ నగర్ గ్రామానికి చెందిన మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ నెంబర్ సులేమాన్ గ్రామంలో ఉచితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయనను సీపీ శాలువాలతో సన్మానించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరాల అదుపులో సీసీ కెమెరాలు కీలకపాత్రని వహిస్తాయని తెలిపారు. 1 సీసీ కెమెరా 100 పోలీస్‌తో సమానం అని చెప్పారు. దోపిడీ దొంగతనాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు .సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు సహకరించాలని కోరారు. ప్రజలు రద్దీ ప్రదేశంలో ఖచ్చితంగా సీసీ కెమెరా ఉండాలన్నారు. షాపుల్లో రైస్ మిల్లు లలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం డివిజన్ డీసీపీ సునీతా రెడ్డి, ఏసీబీ లక్ష్మీ కాంతరెడ్డి, మైనార్టీ నాయకులు ఆసిఫ్ అలీ, పోలీసులు పాల్గొన్నారు.



సీసీ కెమెరా విజువల్స్‌ను పరిశీలిస్తున్న సీపీ